కవిత్వం

# జెండర్

చింతం ప్రవీణ్

కల్పన ప్రచురణలు
శివనగర్, వరంగల్

షాడో
(కవిత్వం)

చింతం ప్రవీణ్

కల్పన ప్రచురణలు
శివనగర్, వరంగల్.

వెల: **50/–**

ప్రథమ ముద్రణ
జనవరి, 2013

SHADOW
(Poetry)
Poet: **Chintham Praveen**
© Chintham Giri

First Edition: **January, 2013**
Rs: **50/-**

DTP & Printing: **Deepti Printers, Hanumakonda**

*For Copeis:*

CHINTHAM PRAVEEN
# 16-10-237, Shivanagar,
Warangal 506 002.
Cell: 9346886143, 9533530001
email: praveen.kuc@gmail.com

&

**All Leading Book Shops**

*అంకితం



డా. పట్నం శేషాద్రి గారికి

# కృతజ్ఞతలు

**అల్లం రాజయ్య,** ప్రముఖ రచయిత

**అంపశయ్య నవీన్,** ప్రముఖ రచయిత

**ప్రొ॥ కొంక యాదగిరి,** డైరెక్టర్, తెలుగు అకాడమీ, హైద్రాబాద్

**ప్రొ॥ కాత్యాయనీ విద్మహే,** తెలుగు విభాగాధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం

**ప్రొ॥ బన్న అయిలయ్య,** తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం

**ప్రొ॥ పంతంగి వెంకటేశ్వర్లు,** తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం

**డాక్టర్ పట్నం శేషాద్రి,** జిల్లా రెవెన్యూ అధికారి, వరంగల్

**పి. చంద్‌యాదగిరి,** ప్రముఖ రచయిత, గోదావరిఖని

**ప్రొ॥వడ్డె రవీందర్,** కెమిస్ట్రీ విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం

**కవి యాకూబ్,** అసోసియేట్ ప్రొఫెసర్, అన్వర్ ఉల్ ఉలూమ్ కళాశాల, హైద్రాబాద్

**ప్రొ॥ మంద అశోక్ కుమార్,** ఎకనామిక్స్ విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం (K.U.B.T.A.)

**పొట్లపెల్లి శ్రీనివాసరావ్,** ప్రముఖ కవి • **డా॥ సంగని మల్లేశ్వర్**

**డాక్టర్ జిలుకర శ్రీనివాస్ • చిర్రా రాజేష్ ఖన్నా • పసునూరి రవీందర్**

**సాయిని నరేందర్ • తిరునహరి శేషు • గాడిపెల్లి మధు**

**నాగిళ్ళ రామశాస్త్రి • మహ్మద్ సిరాజుద్దీన్ • మాడభూషి మాలతీ**

**రక్తాని శ్రవణ్‌కుమార్ • నూర శ్రీనివాస్,** ప్రముఖ జర్నలిస్ట్

**లేతాకుల దశరథరామిరెడ్డి • కొత్తపెల్లి శ్రీనివాస్**

**అక్కాచెల్లెలు బొట్టు కరుణ, రామినేని కవిత**

**నవసమాజ్ సేవాసమితి • గోదావరి సాహితీ మిత్రులు**

**స్నేహ సాహితీ గ్రంథాలయం,** గోదావరిఖని

## ప్రత్యేక కృతజ్ఞతలు



**డా॥ బన్న అయిలయ్య**
ప్రొఫెసర్

తెలుగు విభాగం
కాకతీయ విశ్వవిద్యాలయం
విద్యారణ్యపురి, వరంగల్
సెల్: 9949106968

# ఉద్విగ్న సంభాషణ

**"ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పాపను చంకనెత్తుకున్న బిచ్చగత్తె**
**బస్టాండ్ రైల్వేస్టేషన్లలో కోల్పోవడానికి సిద్ధంగా ఉన్న యవ్వనవతి**
**స్వేదం కురుస్తున్నా బతుకు రిక్షా బండిని లాగుతున్న వృద్ధుడు**
**వివర్ణ ప్రతిబింబాలై విచలిత బతుకులను భుజాలపై మోస్తున్న బాటసారి**

**బతుకు సుడిగుండంలో జీవితాన్ని కోల్పోతున్న వీళ్ళందరు**
**గుండెను నిమిషానికి వెయ్యిముక్కలు చేస్తారు**
**అయినా ఒక చుక్క కన్నీరు కార్చలేను"** అంటాడు ప్రవీణ్. కారణం సామ్రాజ్యవాదం ఇంకా విస్తరించలేదు. కనుక "కన్నీళ్ళింకా వ్యాపారం కాలేదు" అంటారు. సామ్రాజ్యవాద వికృత స్వరూపం ఇంతకంటే క్రూరంగా ఉంటుంది. ఇప్పటివరకు మనం అనుభవిస్తున్న దాని దుష్ఫలితాలు తక్కువే. అది మనిషిని, మానవత్వాన్ని సాంతం నమిలిమింగేసాక బిచ్చగాళ్ళు, ఒళ్ళమ్ముకునే యువతులు, శక్తికి మించిన బరువులను లాగుతున్న వృద్ధులు, బతుకే కకావికలమై జీవచ్ఛవంలా బతికీడుస్తున్న బడుగు జీవులకు ఈ సమాజంలో చోటుండకపోవచ్చు. ఇది పెట్టుబడిదారి, సామ్రాజ్యవ్యవస్థ. రూపాయి నాణెం ముందు దాసోహం అంటూ మోకరిల్లిన వ్యవస్థ. డబ్బున్నవాడు, కొనుక్కోగలిగిన స్తోమతున్నవాడు బతకడానికి అర్హత కలిగిన వ్యవస్థ ఇది. దీన్నే మనం అభివృద్ధంటూ మురిసిపోతున్నాం. ఇలాంటి చిందరవందర వ్యవస్థనే కవి దృశ్యమారం చేస్తున్నాడు.

అధికారం కోసం, అందలాలకోసం కోటానుకోట్ల సంపాదన కోసం సమస్త వనరుల్ని స్వంతం చేసుకుంటూ వ్యక్తిగత ఆస్తుల్ని కొండల్లా పెంచుకుంటున్న వాళ్ళకు ఈ దీనాతిదీనమైన వివరణ జీవితాలు కనిపించవు. ఒకవేళ కనిపిస్తే తనకు అధికారం కట్టబెట్టే "ఓటరు దేవుళ్ళు" గానే కన్పిస్తారు తప్ప. హృదయమున్న, చీము నెత్తురున్న మనిషి లాగా వాళ్ళకు కనిపించరు. తమ లాభాల మార్కెట్‌లో వస్తువుల్లాగానో, కొనుగోలుదారుల్లా గానో కన్పిస్తుంటారు. ఇట్లాంటి వ్యవస్థలో మార్పు రావాలనే కవి తపన. ఇతరుల సానుభూతి పొందడానికి కార్చే కన్నీళ్ళ కంటే ఈ వ్యవస్థను ఇంత నికృష్టంగా మార్చిన పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేసాడు ప్రవీణ్. "రోగాల్ని నయం చేయడం కాదు ఇప్పుడు కావాల్సింది, రోగాల్ని సృష్టిస్తున్న ఈ వ్యవస్థని మార్చడం'' అన్న డాక్టర్ నార్మన్ బెయాన్‌లా ఆలోచిస్తున్నాడు ప్రవీణ్.

భూర్జువా సంస్కృతి, ఫ్యూడల్ సంస్కృతి కలగలిసిన వింత సమాజం ఈ దేశంలో ఉంది. దీన్నే మనం ఆధునికం అనుకుంటున్నాం. ఆధునికతను అర్థం చేసుకోవడంలోనే తప్పటడుగు వేసే మనం "...స్లేవరిజానికి / అందమైన ముసుగు తొడిగిన ..." దాన్ని కవి వ్యతిరేకిస్తున్నాడు. భూస్వామ్య వ్యవస్థలో దొర కచ్చరం ముందు పశువులా పరుగెత్తె బానిస కన్నా, నేటి జీవితం ఏ మాత్రం మెరుగ్గా లేదంటూ, **"కొరడా చేపట్టే హస్తాలు మారుతున్నాయ్, నెత్తురు చిందించే శరీరాలు మారట్లేదు"** అంటాడు 'కచ్చరం' అనే కవితలో.

వివిధ పొరలు, విభిన్న నేపథ్యాలు కలిగిన వందలాది మంది కార్మికులు ఫ్యాక్టరీల్లో కలిసి పనిచేస్తుంటారు. అందుకే పరిశ్రమలను ఆధునిక దేవాలయాలంటారు. మానవత్వాన్ని పెంపొందించే ఇట్లాంటి దేవాలయాలను కూల్చివేసి మౌఢ్యాన్ని పెంపొందించి, మానవత్వానికి విఘాతం కలిగించే ఆలయాలను కట్టిస్తూ భక్తిని 'ఎగ్జిబిట్' చేసే ఈ వ్యవస్థ పయనం తిరోగమనం వైపా? పురోగమనం వైపా? అనే ఆలోచనలలోకి ఈ కవిత్వం నెట్టివేస్తుంది. "మిల్‌గ్రౌండ్" కవితలో

**"నువ్వు మైదానానివే కాదు**
**సర్వకుల సంగమానివి**
**నీ మట్టిసాక్షిగా**
**ఎన్ని కులాలు**
**ఇంకెన్ని మతాలు**
**కలిసి నడువలేదు**

**కలిసి మైత్రితో పరుగెత్తలేదు"** అని తెలంగాణాకే తలమానికమైన ఓరుగల్లులోని ఆజంజాహిమిల్ కాయిలాపడిన సందర్భాన్ని, ఆ ఫ్యాక్టరీ స్థలంలో విస్తరిస్తున్న కాంక్రీట్ సామ్రాజ్యాన్ని చీల్చి చెండాడాల్సిన అవసరముందని కవితలో అంటున్నాడు ప్రవీణ్.

ఇటీవలి మన ప్రజాస్వామిక భారతం చూసినపుడు, ప్రజాస్వామిక సోషలిజం వ్యవస్థను చూసినపుడు ఒకింత ఆశ్చర్యం, మరికొంత జుగుప్స, ఇంకొంత ఆగ్రహం కలుగక మానదు. ప్రజా సంక్షేమ కోసం ప్రణాళికలు తయారు చేయించి వాటికి చట్టబద్ధత కల్పించి, బ్యూరోక్రాట్స్ ద్వారా అమలు చేయించాల్సిన ప్రజాప్రతినిధులు ఇంగితం, విచక్షణలో ప్రవర్తించాల్సిన బ్యూరోక్రాట్స్ జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారు. మానీలాండరింగ్, మైనింగ్ అక్రమ జీవోలు, భూకబ్జాలకు పాల్పపడ్డారనే ఆరోపణల కారణంగా వాళ్ళంతా జైలుకెళ్ళితే జైల్లోని సాధారణ ఖైది వీళ్ళకు చూసి –

**"గిక్కడన్న మమ్మల్ని**
**ప్రశాంతంగా బతకనీయండి సచ్చేదాక**

**తరువాత దీన్ని కబ్జాచేద్దురు గని"** వ్యంగ్యంగా అనడంలోని వాస్తవాన్ని అర్థం చేసికోవాలి. ఇలాంటి దళారీ రాజ్యంలో, చివరకు 'బెయిల్ ఫర్ సేల్' వ్యవస్థలో సామాన్యుడిని బతుకు జైల్లో కూడా ప్రశాంతంగా లేకుండా పోతుంది.

ఈ వ్యవస్థ ఇట్లా ఎందుకుందో ప్రశ్నించుకుంటున్నాడు కవి ప్రవీణ్. ఈ ప్రశ్న లేకుంటే సమాజమెక్కడెదని సూటిగా అడుగుతున్నాడు. దుఃఖానికి కారణమేమిటని గౌతమబుద్ధుడు ప్రశ్నించకుంటే, అసమానతలకు కారణమేమిటని కారల్ మార్క్స

ప్రశ్నించకుంటే చెట్టు నుండి రాలిన ఆపిల్ పండు నేల మీదనే ఎందుకు పడుతుందని న్యూటన్ ప్రశ్నించకుంటే, కులం, అస్పృశ్యతలకు మూలాలెక్కడని భారతరత్న డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రశ్నించకుంటే ఇంకా డార్విన్, కోపర్నికస్, ఫ్రాయిడ్ లాంటి వాళ్ళకు ప్రశ్నలే ఉదయించకపోతే ఈ ప్రపంచం ఇలాగే ఉండేదా? అపూర్వ చైతన్యం వెల్లివిరిసేలా? అందుకే ప్రవీణ్ "ప్రపంచమెప్పుడూ / ప్రశ్నల ఇరుసుపై పరిభ్రమిస్తుంది" అంటాడు.

కొత్తగా పొడుచుకొస్తున్న పదునైన కలం ప్రవీణ్‌ది. వస్తువును ఎన్నుకోవడంలో, దాన్ని కవిత్వీకరించడంలో ఏ బేషజాలు లేని కవితను. చెప్పేది స్పష్టంగా, సూటిగా చెప్పడం ఈ కవి లక్షణం. "నెగడు"లో తన ఉద్యమ భావనలకు పులికాపు బెట్టితే, 'షాడో' లో పదునైన వ్యక్తీకరణతో మనముందుకు దూసుకొస్తున్న ఈ కవికి ఆహ్వానం పలుకుదాం !

తేది. 12-12-12 (బన్న అయిలయ్య)

రాజగృహం, హన్మకొండ

**కవి యాకూబ్**
అసోసియేట్ ప్రొఫెసర్

తెలుగు విభాగం
అన్వర్ ఉల్ ఉలూం కళాశాల
హైద్రాబాద్
సెల్: 98491 56588

# అన్వేషణ ఇతని కవిత్వ రహస్యం!

ఒక నిరంతరచింతన, అంతరాంతరాల్లో ఎగిసే అగ్ని, తనలోతాను ఘర్షిస్తూ, తపిస్తూ ప్రతి అక్షరాన్ని తన ప్రాణవాయువుగా సంభావిస్తున్నట్లుగా చింతం ప్రవీణ్ కవిత్వం చదువుతుంటే అర్థమవుతోంది. చాచిన చేతులకు తగలని ఆప్యాయతల్ని తలుచుకుని బెంగగా కవిత్వమై పలుకుతున్నాడు. తాత్వికతలోకి ప్రయాణిస్తూ 'అలసటే లేని వెర్రి అన్వేషణ' మార్గాన్ని తనదంటూ ఒకటి సృష్టించుకుంటున్నాడు. కృత్రిమవాస్తవాల్ని జీర్ణించుకోలేకపోతున్నాడు.

**'అబ్బా!' నటించడం ఈ జనాలు ఎక్కడ నేర్చారు**
**ఒక్కొక్కనిలో ఒక్కో నటుడు**
**జీవించడం మానేసి**
**నటించడంలోనే జీవిస్తున్నారు"** ఇదీ బెంగ.

ఈ బెంగను అనేక రచనల్లో రమారమిగా విస్తరించాడు. తనను నిలువనీయని బెంగ ఇదే. తట్టుకోలేనంత బెంగ. బిగ్గరగా ప్రకటించాలన్నంత కసితో కూడిన బెంగ. కోల్పోతున్నది మరెవరినో కాదు మనిషిని. మాయమైపోతున్న మనిషి, మానవసంబంధాలు, మానవాభిమానాలు, ప్రేమలు, ఆప్యాయతలు, దయ, కరుణ ఇవన్నీ ఇతని కవిత్వానికి భూమిక.

పలకవలసినదే సరిగ్గా సరియైన సమయంలో పలుకుతున్నాడు. అడగవలసినదే అడుగుతున్నాడు. ఇకనైనా మనుషులుగా మిగలాలని ఇలా మనిషిని వెన్నంటివుండే నీడను జ్ఞప్తికి తెస్తున్నాడు.

'తిరోగమనం' కవితలోనూ–

**'ఎటుచూసినా**
**ఒక్క మనిషి కనపించట్లేదు**
**నా దేశంలో'** అంటున్నాడు.

'పదే పదే' కవితలో అలానే...

**'పదే పదే**
**నేనే ఎందుకు**
**అందరిలో ఒక్కడిగా మిలుగుతాను?'** అంటాడు.

'మొఖం లేనోడు' కవితలో–

**'వాడికీ హృదయముంటుంది**
**దానికి స్పందన ఉండదు**
**అది స్పర్శించదు'**

సందర్భమేదైనా ప్రవీణ్‌ను వెంటాడుతున్నదీ, తాను బెంగపడుతున్నదీ 'మనిషి' గురించే. మనిషి, మనిషి, మనిషి... ఎలా దొరుకుతాడు ఇతడికి, అన్వేషిస్తున్న మరెందరిలాగానే ఇతనూ అన్వేషిస్తున్నాడు. ఆ అన్వేషణే చింతం ప్రవీణ్ కవిత్వం.

'నాన్న' గురించి రాసిన కవిత హృదయాన్ని కదిలిస్తుంది. ఎంతటి సున్నితమైన కవో నాన్నను సంభావించిన తీరులో కన్పిస్తుంది. అందుకే తన సున్నితత్వాన్ని రంగరించినట్లుగా **'నాన్న బతుకుంతా మన జీవితమే కదా'** రెండు కవితాపాదాల్లో నిక్షిప్తం చేశాడు. కవిగా పరిణతిని సాధించిన స్థితి చింతం ప్రవీణ్ కవిత్వం చదువుతుంటే కన్పిస్తుంది. కవిత్వం చెయ్యడం ఎలానో ఆ పరుసవేదివిద్య ఇతనికి అబ్బింది. అది చిన్న కవితైనా, లేదా వివరణగా రాస్తున్న కవితైనా ఎక్కడా వచనమై తేలిపోదు. నిఖార్సయిన కవితా విన్యాసం ఈ సంకలనంలో చూస్తాం. 'భూమిని రక్షించండి' కవిత నాలుగు పేజీలకు విస్తరించిన కవిత. కాని ఎక్కడా పలచనైపోయిన భావన కలుగదు. కవితను ఎత్తుకోవడం, ముగింపు ఇవ్వడం వరకూ ఒక మనిషిని సంబోధిస్తున్నట్లు తన కవితా నిర్మాణ వ్యూహాన్ని ఎంచుకుని

నడిపించాడు. ఇది కేవలం కవిత్వ రహస్యం తెలిసినవాళ్ళకు మాత్రమే తెలిసిన నైపుణ్యం. ప్రవీణ్ తననుతాను రోజురోజుకీ మెరుగుపరుచుకుంటూ కవిత్వ రహస్యమెరిగిన కవిగా నిలదొక్కుకున్నాడు.

ఆ మధ్య సాహిత్య అనువాదకులు నవుడూరి మూర్తిగారు ప్రత్యేకంగా ఫోను చేసి చింతం ప్రవీణ్ గురించి అడిగారు. "ఆ కవి ఎవరో కానీ 'కవిసంగమం' ఫేస్‌బుక్ వేదికలో తనదైన ప్రత్యేకతను తన కవిత్వంలో చాటుకున్నా"డని మెచ్చుకుంటున్నప్పుడు నాకన్పించిన విషయం ఒకటే! ఏ కవి అయినా గుర్తింపును పొందవలసింది తనదైన కవిత్వ ముద్రతోనే అని. ఆ తర్వాత నవుడూరి మూర్తి గారు, జయతీధాత్రి గారు ఏరికోరి ప్రవీణ్ కవితల్ని ఇంగ్లీషులోకి అనువదించి, తన 'అనువాదలహరి' బ్లాగులో ప్రకటించారు కూడా!

ఈ విషయం చింతం ప్రవీణ్ కవిగా తనను తాను నిరూపించుకుంటున్నాడని చెప్పడానికి ఒక ఉదాహరణ మాత్రమే. తనదైన కవిత్వ ముద్రను అన్వేషించుకుంటూ చేస్తున్న ప్రయాణంలో ఈ రెండవ సంపుటి ప్రధానమైనది. ఒకవైపు ప్రాంతీయ ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొంటూనే, మరోవైపు కోల్పోతున్న మనిషిని కూడా అన్వేషిస్తూ తన కవితాయానం సాగిస్తున్నాడు.

తనకు ఎదురైన ఏ అనుభవాన్నీ, ఏ సందర్భాన్నీ తనదైన కోణంలో విశ్లేషించుకోవడం, తాత్త్వికంగా ఆలోచించడం మానుకోలేదు. 'నువ్వెందుకు చస్తవ్' కవితలో ప్రవీణ్ ఆత్మహత్యల గురించి ఆవేదనతో పాటు ఆగ్రహమూ ప్రదర్శించాడు.

**'నిజానికి**
**నీకు తెలియదేమో**
**నీ బతుకులాగే**
**నీ సావు నీ చేతిలో లేదురా!'** ఎవరి చేతిలో వాళ్ళ చావు లేని స్థితిలో బతుకుతున్న ప్రతిదినం కసిగా బతకాలంటున్నాడు. అభివృద్ధి పేరుతో ప్రతి గడపకూ విస్తరిస్తున్న మృత్యువులాంటి అభివృద్ధిని 'రోడ్డు'

కవిత ఎండకడుతుంది. **'రోడ్డు ఊరును మింగి బరియల్ గ్రౌండ్ అయ్యింది'** ఇంతకంటే జరుగుతున్న అభివృద్ధి ఫలితాల్ని ఇంకా వేరే విడమరిచి చెప్పనవసరం లేదేమో!

'ఎవరిని మోస్తున్నాం' కూడా ఒకానొక ఆగ్రహ ప్రకటనే! ముసుగులన్నీ తొలగిపోయాక అప్పటివరకూ తనకే పరాయిదిగా అన్పించిన తన ముఖం తనదిగా అగుపించడం వెనుక దాగిన ఆవేదనతో కూడి ఆక్రోశం కన్పిస్తుంది. పిడికిలి బిగించి సమూహం కోసం మొదలుపెట్టిన పోరాటంలో చిట్ట చివరికి ముసుగులు తొలగిపోయిన స్థితిని ఈ కవితలో ఒక గుణపాఠంగా చిత్రించాడు.

ప్రవీణ్‌లోని కవి ఎంతో అప్రమత్తమైనవాడు. తనకంటూ ఒక వివేచనతో ఏ ముందస్తు స్థిరీకరణలకు లోనుకాకుండా స్వచ్ఛంగా, మనిషితనంతో ప్రకటితమయ్యే స్వభావం వల్ల ప్రవీణ్ కవిత్వం ఎక్కడా సత్యదూరంగా వున్నట్లు అగుపించదు. తాను ఏదైతే చెపుతున్నాడో అదంతా ప్రతి కవిత్వపాదంలోనూ ఒక నమ్మకమైన భావనగా మనల్ని చేరుతుంది. అలాంటి స్థితికి చేరుకోవడమనేది కవిగా ప్రవీణ్ సాధించిన విజయం. ప్రతి కవితలోనూ ఆ నిజాయితీ కోణం పాఠకుడికి అందుతూనే వుంటుంది. 'ప్రపంచమెక్కడిదీ ప్రశ్నేలేకుంటే' వంటి కవితా పంక్తులు ఆ నిజాయితీలోని భాగాలే.

**'ప్రశ్న ప్రవహిస్తూ వుంటుంది**
**వ్యక్తి నుండి సమూహంలోకి**
**సమూహం నుండి ఉద్యమంలోకి'**

ఇంతటి చైతన్యం వల్ల ప్రవీణ్‌లోని అన్వేషణ తన చుట్టూతా జరుగుతున్న, లేదా నడుస్తున్న అన్ని అంశాలపైనా ప్రసరిస్తూనే వుంది. అటువంటి 'ఎరుక' అతడిని నిత్య చైతన్యవంతుడిగా మిగిల్చింది కూడా! అదే చైతన్యంతో కూడిన అన్వేషణలోంచే తన అక్షరాన్ని సమాయత్తం చేసుకున్నాడు.

**'అందుకే... అందుకే**
**నేను ఆయుధాన్ని కాదని**

**అక్షరాన్ని చేపట్టాను'** ఈ చేపట్టిన అక్షరం ప్రవీణ్‌లోని అన్వేషణను అంత త్వరగా చల్లారనీయదు. అది అనంతంగా ప్రవీణ్‌లో విస్తరిస్తుంది. ఇప్పటికే మొదలైన ఈ మనిషి అన్వేషణ, పరివ్యాప్తమవుతూ అన్ని అంశాలలోకి ప్రసరిస్తున్నట్లు ఈ కవితా సంపుటి ప్రకటిస్తున్నది.

**'నా అక్షరమెప్పుడూ గురి తప్పదు**
**సూటిగా తూటాలాగా ప్రయాణిస్తుంటుంది'**

ఇలాగే ఇక ప్రయాణిస్తుందని కూడా ఈ కవితా సంపుటి చదివాక ఇతని అక్షరమ్మీద నమ్మకం కలుగుతూంది. 'ఎక్కడైనా కన్నీళ్ళు అద్దెకు దొరికితే బాగుండునని' వెతుకుతున్న తడివున్న కవి ప్రవీణ్. తనలోపలి దుఃఖం ఘనీభవించిన సందర్భాన్ని, బయటి సందర్భంలోంచి కలిపి బండబారిన జీవితాల స్థితికి కారణాలేమిటో వెతుకుతున్నాడు.

ఇన్ని అన్వేషణల సమాహారంగా ఈ కవితా సంపుటి లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు వెదకాల్సిన అవసరం తప్పనిసరిగా వుంది. ప్రవీణ్ కోరుకుంటున్నది కూడా అదే! అటువంటి ప్రశ్నల్ని మళ్ళీ ఒకసారి మనందరి మనసుల్లో నాటే కర్తవ్యాన్ని మాత్రం తప్పనిసరిగా నెరవేరుస్తుందని నా గట్టి నమ్మకం. అలా జరిగితే ఈ కవిత్వం ఉద్దేశ్యం నెరవేరినట్లే.

ఇన్ని ప్రశ్నల్ని, అన్వేషణల్ని, ఆవేదనల్ని కవిత్వంగా మలిచి మనముందుకు సంపుటిగా తెస్తున్న చింతం ప్రవీణ్‌ను అభినందిస్తున్నారు. 'కవి సంగమం' వేదిక ఇతని కవిత్వానికి వాహికైనందుకు గర్విస్తున్నాను.

తేది: 12-12-2012 **కవి యాకూబ్**
హైదరాబాద్

# కవితలు...


1. ఆమె .... 19
2. ప్రశ్న .... 21
3. నది నా దిక్సూచి .... 23
4. నా తెలుగు .... 25
5. కాకతీయ కీర్తితోరణం .... 27
6. నా అక్షరం .... 29
7. రోడ్డు .... 30
8. నేను–నువ్వు .... 31
9. కన్నీళ్ళు .... 35
10. స్వప్నం .... 37
11. నాన్న .... 39
12. మిల్‌గ్రౌండ్ .... 41
13. తిరోగమనం .... 43
14. ఫస్ట్ కోవర్ట్ .... 44
15. పంచశ్రామికం .... 46
16. ఏది కవిత్వం .... 47
17. నువ్వెందుకు చస్తవ్ .... 49
18. పదే పదే .... 51
19. ప్లాస్టిక్ దునియా .... 53
20. ప్రిజనర్ వాయిస్ .... 55
21. జీవితం .... 56
22. పం(పాం)చ్ .... 57

23. చరిత్ర .... 58
24. నిన్ను తెలుసుకో .... 59
25. సూటిగా .... 61
26. కృత్రిమ వాస్తవం .... 62
27. నీవు .... 64
28. ఏం దొంగిలించగలం .... 65
29. ఏం మారుతుంది .... 67
30. కొందరు .... 68
31. మొఖం లేనోడు .... 70
32. ఎవరిని మోస్తున్నాం .... 72
33. నేను .... 75
34. ప్రియమైన వ్యక్తికి .... 77
35. మౌనం .... 80
36. కచ్చురం .... 81
37. షాడో .... 83
* అంకితం .... 84
షాడో .... 85

# ఆమె

సాయంత్రం వెలుతురు అస్తమిస్తుంది
ఉదయాన చీకటి అస్తమిస్తుంది
ఆమె ప్రతీక్షణం అస్తమిస్తూనే ఉంటుంది

•

ఋతువులెన్ని మారినా
జీవితమంతా ఆమెకు ఆకురాల్చు ఋతువే

•

ఆమె నవ్వు ఆమెకోసం కాదు
ఆమె అందం ఆమెకోసం కాదు
నిజానికి
ఆమె ఆమెకోసం కాదు

•

ఆమె పంచుతున్న సుఖానికిలాగే
ఆమె స్వేదానికి
ఆమె కన్నీళ్ళకు గురుతుల్లేవ్

•

విలువలు లేని మనుషులు
వలువలు లేని మాటలతో
ఆమెను అంగడిబొమ్మంటు గేలిచేస్తరు...

•

సృష్టి ఆమెను బహిష్కరించిందో
ఆమెనే సృష్టిని బహిష్కరించిందో ఏమోగాని
రహస్య బంధిత జీవన్మరణ క్రీడలో
ఆమె ఎప్పటికప్పుడు దేహాన్ని విసర్జిస్తూనే ఉంటుంది
ఆమెది కోల్పోవడం అనివార్యమైన జీవితం

•

పచ్చనినోట్లతో పచ్చిగా ఆమెను తడమగలమేమో గాని
ఎన్ని రాసులుపోసి ఆమె మనసును తాకగలం

•

స్వేదం కన్నీళ్ళు నెత్తురు ఆవేదనే ఆమె నేస్తాలు
ఆమెకు కలలు లేవు కన్నీళ్ళే
అరే! ఎందరికి తెలుసు ఆమె మనసు?

•

ఆమె కడుపు కోసం పడుపైంది గాని
పడుపు కోసమే కడుపు గడప దాటలేదు

•

ఎందరు వెంబడిస్తారో
ఇంకెందరు నిష్క్రమిస్తారో
ఎన్ని వసంతాలు కరిగిపోతాయో
ఎన్ని కన్నీళ్ళు నదులై పారతాయో
ఎన్ని స్వప్నాలు ఆత్మహత్య చేసుకుంటాయో
దీపం వెలుగుతున్నంత కాలం
ఆమె ఓ ఆరిపోని దీపం

•

ఊరిడ్సినా ఆమెను
ఊరిడ్సిపెట్టదు...
ఆశగా ఆమెవైపే చూస్తుంటుంది

10-02-2012

# ప్రశ్న

సూర్యుడు ఉదయించినన్నాళ్ళు
ప్రశ్నల పురిటినొప్పులు పుట్టుకొస్తూనే ఉంటయ్
సమాధానాల్ని వేటాడుతూనే ఉంటయ్–

•

ప్రశ్న ప్రవహిస్తూ ఉంటుంది
వ్యక్తి నుండి సమూహంలోకి
సమూహం నుండి ఉద్యమంలోకి

•

ప్రశ్న ప్రాణం పోసుకుంటుంది
అన్నార్థుల ఆకలికడుపుల నుండి
శ్రామికుని చెమటబొట్టు నుండి

•

నెత్తురు మాంసాన్ని దోచుకునే
రాకసిమూకల రాబంధుల రాజ్యం
ప్రశ్నలపై నిషిద్ధశాసనం జారీ చేస్తుంది

•

సత్యం లాగే
ప్రశ్న అజరామరం

•

అణువణువు
ధిక్కారాన్ని నింపుకున్న ప్రశ్నకు
మరణముంటుందా?

•

ప్రపంచమెప్పుడూ
ప్రశ్నల ఇరుసుపై పరిభ్రమిస్తుంది

•

ప్రపంచమెక్కడిది
ప్రశ్నే లేకుంటే

27-03-2012

# నది నా దిక్సూచి

నది నా దిక్సూచి–
నేను నదిని వెంబడిస్తాను

•

నది ఎప్పుడూ
జీవనసత్యాన్ని తెల్పుతుంది
అనేకం నుండి ఏకం కమ్మని

•

నది ఎప్పుడూ
ప్రేమతత్వాన్ని బోధిస్తుంది
వ్యక్తి నుండి సమూహంలోకి ప్రవహించమని

•

నది ఎల్లప్పుడూ
పోరాడమని చెబుతుంది

నదుల మధ్య జరిగే జీవన సంఘర్షణ
నదుల మధ్య జరిగే మేధో మధనమే కదా
సముద్రంలో పోటెత్తే ఆటుపోట్లు

•

అందుకే అందుకే...
నేను నదిని వెంబడిస్తాను
నదిని కౌగిలిస్తాను
నదిని ముద్దాడుతాను
నదికి దండం బెడతాను

•

నదిని ప్రేమించాలి
నదిలా ప్రవహించాలి
బతుకెప్పుడు నది ప్రవాహంలా సాగాలి

26-02-2012

# నా తెలుగు

మాతృదేశంలోనే
ఇప్పుడొక మరుగునపడ్డ పదం తెలుగు

•

నడుస్తున్న చరిత్రలోనే
అటకెక్కిన తాళపత్రగ్రంథం తెలుగు

•

మడికట్టుక్కూర్చున్న ఇంగిలీషు బళ్ళో
ఇప్పుడొక మైలపడ్డ పదం 'తెలుగు'

•

చర్చలు లేని ఎన్‌కౌంటర్లు జరిగిపోతూ ఉంటే
తల దాచుకున్న మిలిటెంటులా ఉంది తెలుగు

•

అమ్మానాన్నల ఆశలకు మసిపూసిన మమ్మీ డాడీలు
ఈ శతాబ్దపు భాషా పరిణామం
సీసాపాలనే అమ్మపాలుగా సిద్ధాంతీకరించడం
ఈ శతాబ్దపు మేధోవికాసం

•

పోగు చేసుకున్న భాష అంతా
కాన్వెంట్ బళ్ళో
కార్పోరేట్ కౌగిళ్ళో
సమాధి చేస్తూ
వీసా పాస్‌పోర్టులు నిస్సిగ్గుగా
పరాయిభాషని మన నాలుకలపై అంటిస్తున్నాయ్

•

మొఖానికి రంగులేసుకున్నోళ్ళు
తెలుగులో మాట్లాడుతున్నప్పుడు
దేశభాషలందు నా తెలుగు లెస్సే?

•

మనమిప్పుడు
తలాకొంచెం సిగ్గుపడదాం!
స్వంత ఇంట్లో పరాయిలా ఉన్న మన తెలుగును చూసి
స్వంత ఊళ్ళో వెలికి గురౌతున్న మన తెలుగును చూసి

•

మనమిప్పుడు
మూకుమ్మడిగా తల దించుకుందాం!
తేనెలొలుకు తెలుగుకు తగులుతున్న బెత్తం దెబ్బలను చూసి

•

ఇక
ఇప్పుడు మనకు కావలసింది
హోదాలు సొదలు కావు

•

ఆకలితో అలమటిస్తున్న వాడికి
అందలమెందుకు?

•

పదండి–
కొత్త శిలాశాసనం వేద్దాం
తెలుగును బతికించడానికి
సామూహికంగా ఉద్యమిద్దాం
తెలుగుకు ప్రాణప్రతిష్ట చేయడానికి

*(ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా)*

02-08-2012

# కాకతీయ కీర్తితోరణం

తలెత్తకుండా ఉండలేం
తలెత్తితేగాని చూడలేం

•

ఆత్మగౌరవానికి వెయ్యేండ్ల సజీవసాక్ష్యం
ఈ మట్టి పోరాటానికి శిలారూపం
కాకతీయ కీర్తితోరణం

•

రాజులు రాజ్యాలు
మట్టిపొరల్లో సమాధి చేయబడ్డా
చెక్కు చెదరని నీ రాజసం
తలొంచుకున్నోడికి
తలెత్తడం నేర్పే గంభీరత్వం

•

ఒక్కరా ఇద్దరా
వేలమంది నియంతలు మతోన్మాదులు
వీరచరిత్రను కాలగర్భంలో కలిపేయాలని
కుట్రలు పన్నిండ్లు–
ఒక్కడైనా మిగిలిండా
కాకతీయ కీర్తితోరణం తప్ప

•

ఎంతమందో సామ్రాజ్యవాదులు
నిలువెత్తు రాజ్యాన్ని కబలించాలనీ
దండయాత్రల దండుతో మీసం మెలేసిండ్లు...

•

తీరా నిన్ను చూసాకా_
ఎంతమందికి వెన్నులో వణుకు పుట్టిందో
ఇంకెంతమంది నిలువెళ్ళా కంపించిపోయారో
రొమ్ము విరిచి నిలిచిన నీ పౌరుషాన్ని చూసి_

•

వంగీ సాగిలపడీ మోకరిల్లీ శరణుజొచ్చారే గాని
సవాల్ విసిరి నిన్ను దాటిన శత్రువొక్కడు లేదు

•

మహోజ్వల సామ్రాజ్యానికి శిలాఫలక
మా ఓరుగల్లు కీర్తిపతాక

•

ఉద్యమకారులకు పిడికిలెత్తడం నేర్పింది
వీరులెందరికో పౌరుషాన్ని పురుడు పోసింది
నువ్వే కదా_

•

ఇప్పటికి నీవు మాకు పిడికిలిబిగి భరోసావే!
మానుకోట రాళ్ళు
రాయినిగూడెం మట్టీ
నువ్విచ్చిన ఆయుధాలే కదా

•

కాకతీయ కీర్తితోరణం
పోరుగల్లు కీర్తిశిఖరం

'కాకతీయ ఉత్సవాల' సందర్భంగా
31-10-2012

# నా అక్షరం

నాకెందుకు ఆయుధం
నిజానికి నేనే ఒక
నిలువెత్తు ఆయుధాన్ని

•

నా కలమే ఓ ఫిరంగీ
నా అక్షరమే మందుగుండు సామాగ్రి

•

నేను అక్షరాన్ని
ఒడిసిపట్టుకుంటాను
అతి జాగ్రత్తగా ప్రయోగిస్తాను

•

నా అక్షరమెప్పుడూ గురి తప్పదు
సూటిగా తూటాలాగా ప్రయాణిస్తుంటుంది

•

నా అక్షరాలెప్పుడూ
దుర్మార్గాన్ని చీల్చి చెండాడుతాయ్
పీడితులకు నిలువెత్తు భరోసానిస్తాయ్

•

అందుకే... అందుకే
నేను ఆయుధాన్ని కాదని
అక్షరాన్ని చేపట్టాను

•

అక్షరాన్ని ప్రేమిస్తున్నాను
అక్షరాన్నే విశ్వసిస్తున్నాను

26-04-2012

# రోడ్డు

మునుపిక్కడ ఊరుండేది
ఇప్పుడు రోడ్డుంది

•

మునుపిక్కడ మనుష్యులుండేవారు
ఇప్పుడు శవాలుంటున్నాయ్

•

ఊరు కాటకల్సి
రోడ్డయ్యింది
రోడ్డు ఊరును మింగి
బరియల్ గ్రౌండ్ అయ్యింది

08-07-2012

# నేను - నువ్వు

ఎన్నివేల ఏండ్ల అనుబంధమో
మనిద్దరిది-

•

నాలా నువ్వు
నీలా నేను
ఎన్ని వేలసార్లు రూపాంతరం చెందామో!

•

నాకు నువ్వు లేకపోతే
నింగి నీరు నిప్పు గాలి అన్నీ
శూన్యమే కదా_

•

ఎన్నివేల సముద్రాలను
ఎన్ని లక్షల నదులను నీలో దాచుకున్నా
ఎన్ని అగ్నిపర్వతాలను గుండెల్లో మోస్తున్నా
ఎప్పుడు నిర్మలవదనంతో ఉంటావ్
చూడగానే చేతులెత్తి మొక్కేలా_

•

నేను లేనప్పుడు నీలో
ఎన్ని విస్పోటనాలు సంభవించలేదు
ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవ్వలేదు
నువ్వెన్ని గ్రహాల చుట్టూ తిరగలేదు
నా తోడు కావాలని_

•

ఎప్పుడైతే నేను వచ్చానో
ఎంతగా మురిసిపోయావో
ఇంకెంతగా ముద్దాడావో
తోడు లేక గడిపిన క్షణాలు గుర్తొచ్చి-

●

నన్ను నువ్వు గాఢంగా ప్రేమిస్తావ్
నాకోసమే  యుగాల ఒంటరితనం అనుభవించావ్

●

నువ్వు కార్చిన కన్నీళ్ళు సముద్రాలై
నీ ఆనందభాష్పాలు నదులై ప్రవహించాయ్
నీ ప్రేమకు గుర్తులుగా
కొండా కోన చెట్టూ చేమా అవతరించాయ్
ఒక్కటేమిటీ నీ అణువణువు ప్రేమమయం...

●

నీ తనువులో
ఏ అణువును తాకినా
పులకించిపోయాను
తన్మయత్వం చెందాను-
నన్నింత వెర్రిగా ప్రేమిస్తున్న నిన్ను
కౌగిలించాలనీ
ముద్దాడాలనీ
నా చేతుల్లోకి నిన్ను తీసుకొని మురిసిపోవాలని
నాకనిపించని క్షణం లేదు

●

ఐతే నేనేం చేస్తున్నాను?
నిన్ను అనుభవించే వరకే నటిస్తున్నాను

●

నీతో సహజీవనం చేస్తూనే
నీలో అణువణువు చరిస్తూనే
నీనుండి దూరంగా జరిగిపోతున్నాను
ఓ పక్కన ఒరిగిపోతున్నాను
నీ కోపానికి గురౌతున్నాను

●

నీ ప్రేమే కాదు
నీ కోపం నాకు తెలుసు...
ఒక్కసారి నువ్వు శివాలెత్తితే
కంపించిపోతాను
భయంతో పరుగులు తీస్తాను
బిక్కుబిక్కుమంటు నిన్ను వేడుకుంటాను...
నువ్వు వెంటనే శాంతిస్తావ్

●

మళ్ళీ షరా మామూలే!
నిన్ను గాలికొదిలేస్తాను

●

ఓ భూకామందు నిన్ను రంపపుకోత కోస్తున్నా
ఇంకో దుర్మార్గుడు నిన్ను మరుభూమిలా మారుస్తున్నా
నాకు స్పందనుండదు

●

ఛీ! వెదవ జన్మ
దేన్ని పొందుతున్నామో
దేన్ని పంచుకుంటున్నామో
దాన్ని కాపాడలేకపోతున్నాం –

•

నీకు దూరంగా
ఎన్ని వేలమైళ్ళు నడిచినా
ఒక్క అడుగైనా
నీకు తెలియకుండ వేయగలిగినా?

*(భూమిని రక్షించండి)*

18-11-2012

# కన్నీళ్ళు

నాకెందుకో ఏడ్పురాదు
లోలోపల వేదనతో
హృదయం పగిలి ముక్కలౌతున్నా
పైకి మాత్రం ఒక్క చుక్క కన్నీరు ఉబికిరాదు
అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది
నేను బండబారానా అని!

•

కొందరేమో ఆశ్చర్యంగా
క్షణాల్లో కన్నీళ్ళ కొలనౌతారు
చూస్తుండగానే...

నాకేమో ఏడ్పురాదు

•

అలా రోడ్డుమీద ఓ అడుగు వేస్తానో లేదో–
కకావికలమౌతాను
మెదడులో ఆలోచనకాలోచనాలు
ఉక్కిరిబిక్కిరి చేస్తాయ్
ఒక్కో దృశ్యం
గొంతు తడారేలా చేస్తుంది...

•

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పాపను చంకనెత్తుకున్న బిచ్చగత్తె
బస్టాండు రైల్వేస్టేషన్లలో కోల్పోవడానికి సిద్ధంగా ఉన్న యవ్వనవతి
స్వేదం కురుస్తున్నా బతుకురిక్షాబండిని లాగుతున్న వృద్ధుడు
వివర్ణ ప్రతిబింబాలై విచలిత బతుకులను భుజాలపై మోస్తున్న బాటసారి

బతుకు సుడిగుండంలో జీవితాన్ని కోల్పోతున్న వీళ్ళందరు
గుండెను నిమిషానికి వెయ్యిముక్కలు చేస్తారు
అయినా ఒక్క చుక్క కన్నీరు కార్చలేను

•

అలా సమాజ మరుభూమిలో
ఎవరైనా బతుకుపందానికి ముగింపు పలికితే... వెళ్తానా

సానుభూతి చూపిస్తు కొందరు
తెచ్చిపెట్టుకున్న కన్నీళ్ళతో ఇంకొందరు
నిలువెల్లా తడిసి ముద్దైపోతుంటారు
దింపుడు కల్లంలో ప్రాణం దొరకని చోట
అక్కడ దొరికిపోతాన్నేను

•

ఒక్క చుక్క కన్నీరు రాదు!
వీడు బండబారాడని కొందరంటారు
కృత్రిమ కన్నీళ్ళకు విలువనిచ్చే వాళ్ళు

•

ఎక్కడైనా కన్నీళ్ళు
అద్దెకు దొరికితే బాగుండనుకుంటాను!

•

బహుషా! సామ్రాజ్యవాదం ఇంకా
పూర్తిగా విస్తరించలేదేమో!
కన్నీళ్ళింకా వ్యాపారం కాలేదు

10-06-2012

# స్వప్నం

ఎందరిని వెంబడిస్తానో
ఎందరిని త్యజిస్తానో
ఎంతమంది కన్నీళ్ళు తుడుస్తానో
ఇంకెంతమంది కోసం కన్నీళ్ళు కారుస్తానో

•

ఆనందం
ఆవేదన
కేరింతలు
కౌగిలింతలు

•

నడుస్తూ...
పరిగెత్తుతూ...
ఆగని జీవన ప్రయాణం

•

స్వప్నాస్వప్నాలుగా...
దృశ్యాదృశ్యాలుగా...
రాత్రుళ్ళు... కలలో
కళ్ళు తెరవగానే
నిజరూపం దాల్చుతాయ్—

•

స్వప్నం దిక్సూచి అవుతుంది
ప్రతీ ఉదయానికి

•

జీవితం చేదైనా
స్వప్నం ప్రియమైనదే కదా–

12-10-2012

# నాన్న

విరామమెరుగక
నిరంతరం ప్రవహించే
జీవన నది నాన్న

•

విషాదాలను మోస్తూ
సంతోషాలకై అన్వేషిస్తున్న
బాటసారి నాన్న

•

కుండపోత వానలా దుఃఖం ముంచెత్తి
గుండె రేవును గండికొడుతున్నా
చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం నాన్న
గుండెనిబ్బరానికి నిలువెత్తు చిరునామ నాన్న

•

నాన్న ప్రతీక్షణం
కష్టాలను కౌగిలించుకుంటడు
కన్నీళ్ళతో కరచాలనం చేస్తడు

•

నిజంగా
నాన్నకు కన్నీళ్ళొచ్చినా
నాన్న ఏడ్వలేడు

నాన్న ఏడిస్తే
ఇల్లు ఇల్లంతా కన్నీటిసంద్రమే

•

జీవన గమనంలో అలసిపోయిన బిడ్డలకు
నాన్నిచ్చే ధైర్యం
ముందుకెళ్ళడానికి అభయహస్తం

•

నడవడం నేర్చిన బిడ్డలకు
నడిపించే దారౌతడు నాన్న

•

ఓటమితో అనుక్షణం పోరాడుతు
గెలుపునే పంచే నాన్నే
ప్రతి బిడ్డకి మొదటి హీరో

•

సంతోషాలను సంపదను వాటాలేసే
నాన్న గుండెలోపలి
కన్నీటి దొంతరలను
గుర్తించేదెవ్వరు

•

నాన్న బతుకంతా
మన జీవితమే కదా

•

ఎన్నని చెప్తం–
ఏమని చెప్తం–
సముద్రమంత ప్రశాంతం
అంతర్గత బడబాగ్ని నాన్న

•

నాన్నైతేనే తెలుస్తది
నాన్నంటే

31-08-2012

# మిల్‌గ్రౌండ్

అజంజాహీ
నా ప్రాణవాహినీ
తూరుపు తెలవారుతున్న వేళ
నువ్వో పరుచుకున్న గుండెవి

•

నీ మట్టిని స్పర్శించి
నడిచిన పాదాలు పరిగెత్తినయ్
పరిగెత్తిన పాదాలు లక్ష్యాన్ని చేధించినయ్

•

ఎంత మందో
నిన్ను తాకి
నీ గుండె మీదుగా వీచిన
గాలిని పీల్చి
సాంత్వననొందారు

•

జీవితమనే పరుగుపందెంలో
నిరుద్యోగపర్వాన్ని జయించడానికి
మేము కాళ్ళకు పనిచెప్పినపుడు
నువ్వు మెత్తగా
మా అడుగులను భరించావ్
మా ఆకాంక్షలకు రూపమిచ్చావ్

•

నిరుద్యోగిగా ఉన్నపుడు
మా కన్నీళ్ళు తుడిచావ్
మా చెమటను ముద్దాడావ్

•

నువ్వు మైదానానివే కాదు
సర్వకులాల సంగమానివి
నీ మట్టి సాక్షిగా
ఎన్ని కులాలు
ఇంకెన్ని మతాలు
కలిసి నడవలేదు
కలిసి మైత్రితో పరిగెత్తలేదు

•

అయితే
మాకు బతుకు భరోసానిచ్చిన నీపై
కాంక్రీట్ ఉరి బిగించి
నీ ఊపిరి తీస్తుంటే...

ఒక్క అడుగైనా ముందుకు పడట్లేదు
ఒక్కడైనా కసిగా పరుగెత్తుకొచ్చి
నీ గుండెను కోస్తున్న
కాంక్రీట్ సామ్రాజ్యవాదాన్ని
చీల్చి చెండాడట్లేదు

•

నిజంగా సిగ్గుపడుతున్నాం!

*(అజంజాహి మిల్‌గ్రౌండ్ దీన పరిస్థితిని చూసి)*

19-07-2011

# తిరోగమనం

ఎటు చూసినా
ఒక్క మనిషి కనిపించట్లేదు
నా దేశంలో_

•

ఇక్కడ
ఎక్కడ చూసినా జంతువులే
మనుషులేమో
అడవుల్లో తిరుగుతున్నరు_

07-10-2012

# ఫస్ట్ కోవర్ట్

ఆధిపత్యపు మేధో ఆయుధం
అగ్రవర్ణపు అసలైన కుట్ర
కోవర్టిజం

•

నెత్తుటి బంధం
నమ్మకపు పునాది
కన్నీటి ఆలంబనల్లేని
ముసుగు తొడిగిన కౌగిలి
కోవర్టిజం

•

నమ్మకద్రోహానికి
నయవంచనకు
మారుపేరు కోవర్టిజం_

•

మొట్టమొదటి
నమ్మకద్రోహపు బీజం
నాటాడొకడు
లంకానగరంలో

•

స్వంతరక్తంలో ఇంజెక్ట్ చేయబడ్డ
పరాయివిషం వాడు
అమ్ముడు పోవడాన్ని
లొంగిపోవడాన్ని
వృత్తి చేసినోడు వాడు

•

మెదడు వాడిదే
భావజాలం మాత్రం పరాయి
వాడో మేథో దళారి

•

వాడొక నయా బానిసకులాన్ని నిర్మించినోడు
నమ్మకాన్ని అంగడి సరుకు చేసినోడు

•

వాడు కోవర్ట్ ఆపరేషన్ పితామహుడు
వాడే రాజా విభీషణ్

17-06-2012

# పంచ శ్రామికం

ఎవరి నెత్తురు ఈ నేల

ఎవరి స్వేదం ఈ నీరు

ఎవరి ఊపిరి ఈ గాలి

ఎవరి ఆక్రందన ఈ నింగి

ఎవరి ఆవేశం ఈ నిప్పు

01-05-2012

# ఏది కవిత్వం

ఎన్నాళ్ళీ నియమాల నిచ్చెనమెట్లు
ఇక ధ్వంసం చేద్దాం

•

ఈ రంధ్రాన్వేషణలకు
ఈ శిల్పాన్వేషణలకు
ఇక ముగింపు పలుకుదాం_

•

జనాలకోసమే రాస్తున్నప్పుడు
జనాలకు అర్థంకాకపోతే
అదేం కవిత్వం?

•

పదాల్ని శిల్పాల్లా సానబెట్టి
సర్ఫులో నానబెట్టి
ఉతికి ఆరేసేదే కవిత్వమా?

•

విమర్శకుల ఇనుపకచ్చడపు
చట్రాల కిందపడి
పరిశీలకుల పాముకాటుకు గురై
నురగలు కక్కుతూ చచ్చీ చెడి
బతికి బట్టకట్టేదే పదమా
ఆ పదాల సమూహమే కవిత్వమా?

•

కవిత్వానికి కులముంటుందా?
కవిత్వానికి మతముంటుందా?

•

ఎవరు ప్రయోగిస్తే పదం
ఎవరు సాగదీస్తే వాక్యం
ఇంకెవరు ఇరగదీస్తే కవిత్వం?

•

అందమే ముఖ్యమన్నోళ్ళకు
విషయం ముఖ్యం కాదేమో?
మేళాలు తాళాలే ముఖ్యమన్నోళ్ళకు
తండ్లాట ముఖ్యం కాదేమో?

•

మంత్ర నగరిలో మృగాళ్ళకు బలైన అబల స్థితిని
నడిబజారులో నెత్తురోడుతున్న అమరుని త్యాగాన్ని
ఏ శిల్పం ఎవరి సాంప్రదాయ చట్రంలో ఇమడ్చగలం

•

జనం పట్టని
జనాల్ని ముట్టని కవిత్వానికి
బలముండదు
విలువుండదు
చరిత్ర ఉండదు_

18-04-2012

# నువ్వెందుకు చస్తవ్

అరే పిచ్చోడా!
చచ్చేదెలాగో తప్పదు
చావును వాయిదా వేయడమేరా
బతుకంటే_

•

విసుగొచ్చి
ఈ జీవితాన్ని
ఏ హుస్సేన్ సాగర్లోనో విసిరేద్దామనిపించొచ్చు
అవకాశమొస్తే అందరు వెనక్కి
అమ్మ కడుపులోకి పోయేవాళ్ళే

•

నిజానికి
నీకు తెలియదేమో
నీ బతుకులాగే
నీ చావు నీ చేతిలో లేదురా!

•

ఏ ఎలక్షన్ దొమ్మీలోనో
ఏ నాయకుడు సచ్చినప్పుడో
ఏ మత ఘర్షణలోనో
కనీసం_
వరదలోనో మ్యాన్‌హోల్ బురదలోనో
నీ చావు రాజ్యం ఫిక్స్ చేస్తుంది

•

అప్పటికి
నీ ప్రాణం పోకపోతే_

ఏ ఆల్కాహాలో ఏ ఆకలిచావో
ఏ కులరక్కసో
ఏ మతం మానసికదాడో
నీకు చావు ప్రసాదిస్తుంది

•

ఎలాగూ చచ్చేదానికి
రోజు సావడమెందుకు
బతుకుతున్న ప్రతీదినం కసిగా బ్రతకాలి
ఇవ్వాలే చివరిరోజన్నంత కసిగా_

01-09-2012

*క్షణికావేశాలకు లోనై*
*'ఆత్మహత్య'లకు పాల్పడుతున్న యువతనుద్దేశించి*

# పదే పదే

పదే పదే
నేనే ఎందుకు
డిస్టర్బ్ అవుతాను?

•

పదే పదే
నా మనసే ఎందుకు
కకావికలమౌతుంది?

•

పదే పదే
నేనే ఎందుకు
కన్నీటి సంద్రమౌతాను?

•

పదే పదే
నేనే ఎందుకు
అన్నీ త్యజిస్తుంటాను?

•

పదే పదే
నేనే ఎందుకు
విస్ఫోటనం చెందుతుంటాను?

•

పదే పదే
నేనే ఎందుకు
ప్రశ్నల్ని మోస్తూంటాను?

•

పదే పదే
నేనే ఎందుకు
సమాజాన్ని వెలివేస్తూ ఉంటాను?

•

పదే పదే
నేనే ఎందుకు
అందరిలో ఒక్కడిగా మిగులుతాను?

•

పదే పదే
నేనే ఎందుకు
నిద్రలేని రాత్రులు గడుపుతాను?

•

పదే పదే
నేనే ఎందుకు
సత్యం కోసం వెంపర్లాడుతుంటాను?

24-10-2012

# ప్లాస్టిక్ దునియా

రోజు ఎంతోమందిని
అనివార్యంగా
భుజాలపై మోస్తున్నా
నిజంగా...
ఎంతమందిని ప్రేమించగలం
గుండెల నిండా_

•

అయితే_
ప్రేమించడమనేదే
కాదిప్పుడు పాయింట్
నువ్వెంత కోల్పోతున్నావనేదే
సెంటర్ పాయింట్

•

ప్రేమించమని నిన్నెవ్వరు అడగరు
ప్రేమించడం మొదలుపెడితే
అన్నింటిని ప్రేమించగలగాలి వరుసపెట్టి
పైత్యాన్ని బలాన్ని బలహీనతల్ని...
ఏ క్షణంలోనైనా ఎస్కేప్ అయ్యావో
అంతే! ఓ స్టాంప్
వాడెవడ్ని ప్రేమించలేడని_

•

నిజానికీ
ఎవ్వర్నీ ప్రేమించొద్దు
గుండెల నిండా_
ఈ జనాలకి ప్రేమంటే
బహిర్ దృశ్యమే
అంతర్గతాన్ని ఎవ్వరు విశ్వసించరు

•

కరచాలనాలు
కౌగిలింతలు
చిరునవ్వులు
మాటలు
చివరికి బతుకులు
అంతా ఆర్టిఫీషియల్
అంతా ప్లాస్టిక్ జమాన

•

నిజంగా
నువ్వు బతకాలంటే
అర్జెంటుగా
నీ గుండెను పీకి అవతల పారెయ్

•

నిజంగా
నువ్వు బతకాలంటే
ప్లాస్టిక్ గుండెను అమర్చుకో
ప్లాస్టిక్ ను నిషేదించినట్టు
ప్లాస్టిక్ జిందగీలను
నిషేదించేదాక_

20-03-2012

# ప్రిజనర్ వాయిస్

అన్ని బోయినయ్
నా దేశంలో–

•

నీళ్ళు నావి కావు
నిధులు నావి కావు
కొండలు కోనలు చెట్లూ చేమలూ
ఇసుకా బొగ్గు దుబ్బ ధూళి...
ఇవేమి నావి కావు
నా దేశమే నాది కాదు

•

నా దేశం కబ్జాకు గురైంది
రహస్యంగా హైజాక్ చేయబడ్డది

•

ఇగ ఏదీ మాకు దక్కదని
అన్నీ వదిలేసి
దూరంగా భారంగా బతుకుతున్నం...
చావడాన్ని రిహార్సల్ చేస్తున్నం జైళ్ళలో–

•

గిక్కడన్న మమ్మల్ని
ప్రశాంతంగా బతకనీయండి సచ్చేదాక
తర్వాత దీన్నీ
కబ్జా చేద్దురు గని

28-10-2012

# జీవితం

నువ్వేం కానప్పుడు
నీ పక్కన ఎవరూ ఉండరు

•

'నువ్వే' అయినప్పుడు
నీ పక్కన ఎవరూ ఉండరు

•

మొదటిది భౌతికం
చివరిది మానసికం

15-08-2012

# పం(పాం)చ్

ఎంత ప్రయత్నించినా
చేరవలసిన విషయం
చేరవలసిన హృదయానికి
చేరకపోవచ్చు_1

●

ఏ ప్రయత్నం లేకుండానే
చేరకూడని విషయం
చేరువైన హృదయానికి
చేరిపోవచ్చు_2

●

దూరమౌతున్న ప్రతీదీ
దూరమైనట్టు కాదు
దగ్గరగా ఉన్న ఏదైనా
దగ్గరైనట్టు కాదు_3

●

మనకు తెలియకుండా
మన జీవితంలో
పోగొట్టుకున్న క్షణాలే
మనం కోల్పోయిన నేస్తాలు_4

●

ఏం కోల్పోయామోననే బాధ
ఏం పొందామో చెప్పదు...
ఏం చేసామనే ఆలోచన మాత్రం
ఏం చేయలేదో చెబుతుంది_5

23-07-2012

# చరిత్ర

చరిత్రంటే చెమట బొట్టు

చరిత్రంటే నెత్తుటి జ్వాల

చరిత్రంటే కన్నీటి ధార

చరిత్రెప్పుడూ నాలాగే

నాలాగే నా చరిత్ర–

# నిన్ను తెలుసుకో

అరే! నీకేమైనా
అర్థమవుతుందా అసలు

•

మొదలు
నిన్ను నువ్వు తెలుసుకో!
నిన్ను నువ్వు ప్రేమించు
నీలోని అంతర్గతాన్ని పట్టుకో

•

ఎందుకలా మాటిమాటికి
నిన్ను నువ్వు నిందించుకుంటావ్
వెర్రిగా ఎవరెవరిదాంట్లోకో
దూరిపోతుంటావ్...
నిన్ను విడిచి సాము చేస్తుంటావ్

•

ముసుగులు తొలగించెయ్!
నువ్వు ఎవరికోసమో
నిన్ను త్యజించకు
ఎవరిని లోపల నింపుకోకు
అనివార్యంగా...

•

గుర్తుంచుకో_

ఎదుటోనికి నువ్వెంత ముఖ్యమో

నీకు ఎదుటోడు అంతే ముఖ్యం!

●

ఎవరికీ బెదరకు

ఎవరికీ సంజాయిషీ ఇవ్వకు

నీ అంతరంగానికి తప్ప

25-01-2012

# సూటిగా

ముందు కౌగిలించి
వెనక బురద చల్లకు
చాటు మాటుగా మాట్లాడి
హృదయాన్ని గాయం చేయకు

•

ప్రేమించినా ద్వేషించినా
దుమ్మెత్తిపోసినా
దుర్భాషలాడినా
సూటిగా చెయ్...

•

ఇగోలా ఇజాల మధ్య నక్కి
ఇరుకిరుకు గోడల మధ్య చిక్కి
మనసును కకావికలం చేయకు
మనిషితనాన్ని చంపేయకు

•

గాయపర్చాలంటే
సూటిగా గాయపర్చు
మనసునైనా
మనిషినైనా–

14-05-2012

# కృత్రిమ వాస్తవం

నేనొక వెర్రివాణ్ణి

ఒక్క పలకరింపుతో
పగలూ రాత్రీ
ఊహల పల్లకిలో ఊరేగేవాణ్ణి

ఒక్క చిరునవ్వుతో
ఆత్మీయ ఆలంబనలు
చుట్టూతా అల్లుకునేవాణ్ణి

•

చూసేది కూడా నిజం కాని రోజుల్లో
నటనను నిజమనుకునే వెర్రివాణ్ణి

•

అబ్బా!
నటించడం
ఈ జనాలు ఎక్కడ నేర్చారు
ఒక్కొక్కనిలో ఒక్కో నటుడు
జీవించడమే మానేసి
నటించేస్తున్నరు

•

నిజానికైతే
నటించడానికి జీవించడానికి మధ్య
సన్ననిరేఖ ఎప్పుడో చెరిగిపోయింది

•

నటించేవాడి మస్తిష్కానిక్కూడా తెలియని
గంభీరమైన నటన
నిజాన్ని అవశేషంగా
మార్చే నటన

•

అయినా
మనసును గాయపరిచి
కన్నీటి సునామీలు సృష్టించే వాస్తవం కన్నా
నటనే ఒక్కోసారి జీవం పోస్తుంది

మాటకు
మనసుకు
మనిషికి_

06-03-2012

# నీవు

నన్ను మొత్తంగా
నీలోకి కుమ్మరిస్తున్నా...
నీ హృదయంలో నేను
నిండుకుంటున్న–

# ఏం దొంగిలించగలం

ఎవరి నుండి ఎవరు
ఏం దొంగిలించగలరు

●

ఎవరి హృదయంలోనైన దాగి వున్న
ఒక్క విషయమైనా
దొంగిలించగలిగామా
ఎప్పుడైనా–

●

ఎవరి కన్నులనుంచైనా
కాస్తంత చల్లని చూపును
దొంగిలించగలిగామా
ఎప్పుడైనా–

●

ఎవరి మాటలనుంచైనా
కాస్తంత మంచిని
దొంగిలించగలిగామా
ఎప్పుడైనా–

●

లేదు–
ఎవరి నుంచి ఎవరూ
ఏదీ దొంగిలించలేరు
నిజంగా దొంగిలించబడ్డవన్నీ
ఎదుటి వ్యక్తులు కోల్పోయినవీ కావు

●

నిజంగా
దొంగిలించవలసివస్తే
హృదయాలను దొంగిలించాలి
కాస్తంత ప్రేమను
అందరికి పంచాలి

•

నిజంగా
దొంగిలించవలసివస్తే
ధాన్యపు రాసులను దొంగిలించాలి
అన్నార్థుల కడుపుకు పంచాలి

•

నిజంగా
దొంగిలించవలసివస్తే
కాసిన్ని రాళ్ళను దొంగిలించాలి
వాటితో
భూర్జువా కోటలను ధ్వంసం చేయాలి

02-04-2012

## ఏం మారుతుంది

ఉదయం అయినంత మాత్రాన
సంతోషం ఉదయించదు
రాత్రి అయినంత మాత్రాన
బాధలు అస్తమించవు–

# కొందరు

ఎన్ని మైళ్ళు దూరంగా జరిగినా
ఒక్క అడుగు దూరం కాలేరు

ఎన్నిసార్లు చెరిపేసినా
అణువంతైనా మాసిపోలేరు

ఎన్నిసార్లు త్యజించినా
చేతిని వీడిపోలేరు...

•

వాళ్ళను
ఛీకొట్టి ఛీత్కరించీ
మనం కన్నీరుమున్నీరవుతాం...
దూరంగా నెట్టేస్తూనే
తండ్లాడిపోతుంటాం...

•

దూరంచేసిన ప్రతీసారి దగ్గరగా
చెరిపేసిన ప్రతీసారి చిత్రంగా
త్యజించిన ప్రతీసారి భద్రంగా
గుండెలో వాళ్ళు ఒదిగిపోతుంటారు

•

ఎందుకో కొందరిని

వెర్రిగా...

ప్రేమిస్తూనే ఉంటాం

•

కొందరిని ప్రేమించటం

ఓ వ్యసనం

28-09-2012

# మొఖం లేనోడు

వాడికీ
హృదయముంటుంది
దానికి స్పందన ఉండదు
అది స్పర్శించదు_

•

వాడెప్పుడూ
అవసరాల అక్కసుల నడుమ
అనుబంధాల సాలెగూడు అల్లుతుంటడు

•

అప్పుడప్పుడు_
వాడి మాట వినపడుతుంది
వాని చేతలు కనపడుతాయ్
కనిపించనిదల్లా
వాని మొఖమే

•

నిజానికి
వాడెప్పుడో కాటకల్సిండు
మంచితనం నుండి
మనిషితనం నుండి

•

వాడెప్పుడూ
కారణాలు వెతుకుతుంటడు
ద్వేషించటానికి_
ఊరు వాణ్ణి ప్రేమించటానికి లాగా_

•

గడిచిన ప్రతి నిమిషం
పలికిన ప్రతీ మాట
ఎదురుతిరిగి ప్రశ్నిస్తున్నా...

నడిచిన ప్రతీదారి
విడిచిన ప్రతీ అడుగు
రెప్పపాటు దూరంలో వెంబడిస్తున్నా...

కాంక్రీట్‌పై చరిస్తున్న వాడు
హృదయాన్ని కాంక్రీట్ లాగా మార్చుకుంటడు
నాగరికత నీళ్ళు తాగి బండబారిపోతాడు

•

ఊరిడ్సిన వాడు
ఊరును విడిచేస్తడు

•

*(ఊరుతో పాటు ఊరుపై మమకారాన్ని వదిలేసినోళ్ళకోసం)*

18-01-2012

# ఎవరిని మోస్తున్నాం

యురేకా!

నా మొఖం ఇవ్వాళ నాకు కనిపించిందీ...

•

ఎప్పుడో దశాబ్దం కిందట చూసిన జ్ఞాపకం

నేను రోడ్డెక్కగానే కనిపించడం మానేసింది

ఇన్నాళ్ళెక్కడో కాటకల్సింది

•

ఎంత తండ్లాడినా

ఒక్కసారైనా

నా కంటపడలేదు

ఇన్నేండ్లుగా_

•

ఇవ్వాళ అద్దం ముందు నిలబడ్డానా

ఆశ్చర్యం...

ఎంత ప్రకాశవంతంగా కనిపిస్తోంది...

•

ఎంత అందంగా ఉండే మొఖం

అందవిహీనంగా తయారైంది

•

నేనలా రోడ్డుపై ఆవేశంగా నడుస్తుండేవాడినా...
ఎవరిదో జెండా కత్తిలా
నా మెడపై వేలాడుతుండేది

అప్పుడు...అప్పుడే...ఆ క్షణమే
నా మొఖం హైజాక్ చేయబడ్డది

•

అలా ఉద్విగ్నంగా
మాట్లాడడం మొదలు పెడతానా...
రహస్యంగా ఎవరిదో భావజాలం
నా మెదడులో ఇంజెక్ట్ చేయబడేది

అప్పుడు...అప్పుడే...ఆ క్షణమే
నా మొఖం నా నుండి విడగొట్టబడ్డది

•

నా పాదం కింది నేల హైజాక్ చేయబడుతున్నా
నా జాతి అస్థిత్వానికి గురౌతున్నా
నిర్లజ్జగా అలా ఎవరెవరినో భుజాలపై
అనివార్యంగా మోస్తున్న నా నుండి
నా మొఖం తప్పించుకు పారిపోయింది...

•

చివరికి
నా మొఖం నాది కాకుండా పోయింది

•

ఇదుగో

ఇప్పుడు... ఇప్పుడు

పిడికిలి బిగించి

నాకోసం నా గుంపు కోసం

పోరాడదామనుకున్నానా

•

ఒక్కసారిగా

ముసుగులన్నీ తొలగిపోయినయ్

నా మొఖం నాదైంది.

28-11-2012

# నేను

నేను వర్తమానంలో నిలబడి
గతంలో బతుకుతున్నవాణ్ణి
జ్ఞాపకాల పునాదిపై
శూన్యంలోకి ప్రసరిస్తున్న వాణ్ణి

•

హృదయాన్ని అరచేతిలో పట్టుకుని తిరగడం
ఎంత వేదనో నీకేం తెలుసు!

•

మనిషిని మాత్రమే ఉండి ప్రాణం లేనట్టు
నడక మాత్రమే ఉండి దారి తెలియనట్టు
చూపు మాత్రమే ఉండి దేన్ని చూడలేనట్టు
జీవితమే వెలితి
నువ్వు లేకపోతే–

•

అరే!
ఎన్ని వీధులు తిరగలేదు
నువ్వున్నావనుకొని
నువ్వు లేకున్నా ఉంటావేమోనని

•

ఎంతగా పరితపించానో
ఇంకెంతగా వెంపర్లాడానో
వెర్రిగా ఎంతదూరం పరిగెత్తానో
ఎన్ని సముద్రాలను దోసిళ్ళ పట్టానో–

•

నువ్వు ఏదైనా అవుతావ్
ఏమి కాలేని నాకు_

•

ఇప్పటికి అనిపిస్తుంటుంది
నువ్వులేకపోతే ఏం
బతకలేనా అని?

బతకడం ఎందుకు నువ్వు లేకపోతే
మనసు సమాధానం...

•

గడియకొకసారి నీ గురుతులు
గుండెను తడుముతుంటే
నేను ఉండీ లేనట్టుగానే ఉన్నాను

•

ముసురు ముసురుగా
నీ జ్ఞాపకాలు నన్ను తడిపేస్తున్నా
వర్షాన్ని వాంచిస్తున్న వాణ్ణి

•

వర్షమెప్పుడూ నాలాగే
బహిర్గత సౌందర్యం
అంతర్గత విషాదం...

22-09-2012

# ప్రియమైన వ్యక్తికి

మీలోని ద్వేషాన్నంత భరిస్తూ
మీలోని ప్రేమకోసం
రంధ్రాన్వేషణ చేయలేను–

•

ఇంకా చిన్నవాణ్ణే–
మీరు ప్రదర్శించేదంతా
ప్రేమే అనుకోలేని వెర్రివాణ్ణి

•

ఎవరి హృదయంలోకి
బలవంతంగా చొరబడలేని
అసమర్థున్ని
నన్నిలా వొదిలేయండి

•

మీరు ప్రేమిస్తారో ద్వేషిస్తారో
అది మీ ఇష్టం...
ప్రేమించాలని మనమెప్పుడు
అంగీకారపత్రం రాసుకోలేదు కదా!

•

కానీ చివరగా ఒక్క మాట
ఒక్కసారి ప్రేమించైతే చూడండి–

•

ప్రేమ సర్వ అవస్థల మూలమే కావచ్చు
సర్వదుఃఖాల చికిత్సాలయం కూడా
ఎవరిని ద్వేషించాలన్నా
ప్రేమించటమే ప్రాథమిక సూత్రం–

•

ప్రేమిస్తున్నోడిని కాదు
ద్వేషిస్తున్నోడిని ప్రేమించగలగాలి
సుఖాన్ని కాదు దుఃఖాన్ని ప్రేమించగలగాలి

●

బహుషా
మీరనుకుంటున్నారేమో!
ఏ హృదయమైనా వెతుక్కుంటూ
మీ దగ్గరికి వస్తుందనీ

కావచ్చుగాక–
మీరు గుర్తించకపోతే
ఏకాకి గుండెచప్పుడే
ఎవ్వరూ మిగలరూ
ఒంటరిగా జీవితాంతం–

●

ఒక్కసారి చెదిరిన హృదయానికి
ఎన్ని వేల ప్రేమ పూతలు పూసినా
ప్రయోజనం ఉండదు

●

నా ప్రేమకు గుర్తుల్లేవేమో
మీ ద్వేషపు గుర్తులు
శాశ్వతంగా మిగిలిపోతాయ్...

●

చివరిమాటగా
ఒక్కసారి సముద్రాన్ని చూడండి...
నదులు ఆటుపోట్లు సృష్టిస్తున్నాయని
నదులను వెలివేయడం లేదు కదా

సముద్రమెప్పుడూ మీలాగే?...

02-06-2012

# మౌనం

మౌనం
అక్షరాల్లేని లిపి
ధ్వనిలేని సంగీతం

•

మౌనం
పెదవి కదిలితే మాట
గొంతెత్తితే పాట

•

మౌనం
నినాదానికి కసరత్తు
ఉద్యమానికి తొలి ఎత్తు

•

మౌనం
మాటకు తొలిరూపం
బతుకు చివరిరూపం

23-05-2012

# కచ్చరం

కొరడా చేపట్టే హస్తాలు మారుతున్నాయ్
నెత్తురు చిందించే శరీరాలు మారట్లేదు

•

బతుకు మొదలైన దగ్గర్నుండీ
పరిగెత్తడమే
మా జీవితమైంది

ఇప్పుడు నా వంతు...

•

ఒకప్పుడు
కోల్పోయిన జీవితం
ఇప్పుడు
పొందాల్సిన జీవితం
నన్ను పరిగెత్తిస్తున్నాయ్
విరామం లేకుండా

•

మారింది–
కచ్చరం స్వరూపమే
స్వభావం కాదు

•

నా స్లేవరిజానికి
అందమైన ముసుగు తొడిగిన
నయాజమానా కచ్చం
మీకెక్కడా కనిపించదు

•

నెత్తురు ఎక్కడా నమోదు చేయబడదు
ఆర్తనాదం ఎక్కడా రికార్డ్ కాదు
ప్రాణాలు మాత్రం గాల్లో కలిసిపోతుంటాయ్

•

ఏం మారలేదు
నా పరుగు ఆగలేదు
నేనింకా పరిగెత్తుతూనే ఉన్నాను

10-11-2012

# షాడో

అమ్మ కడుపులోంచి బైటపడి
అవని కడుపులోకి ఒదిగిపోయే దాకా_
కడుపుకోసం...
ఎన్నో గడపల కడుపుల్ని చీల్చుకుని
మన చుట్టూ  మనం భ్రమిస్తూ
కాలచక్రం చుట్టూ పరిభ్రమిస్తున్నా
ఎప్పుడూ_
మనల్ని వీడనిది
'నీడే' కదా_

05-12-2012

# అంకితం

జీవించడమంటే
రోజులను కోల్పోవడం కాదు

•

కోల్పోయిన జీవితాలను
నిలబెట్టడం...

•

నిలబడిన జీవితాలను
పరుగెత్తించడం...

•

పరుగెడుతున్న జీవితాలకు
దారిని చూపడం...

•

దారితెలియని వాళ్ళకు
గమ్యాన్ని చూపడం...

•

అంతిమంగా...

కోల్పోతున్న జీవితాలు
గమ్యం కోల్పోకుండా చూడడం...

---

రెవెన్యూశాఖలో క్షణం తీరిక లేకుండా ఉండి కూడ ఓ వైపు సాహిత్యసృజన చేస్తూ మరోవైపు నాలాంటి యువ రచయితలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ పట్నం శేషాద్రి గార్కి మనస్ఫూర్తిగా నా, ఈ 'షాడో' పుస్తకం అంకితమిస్తున్నాను.

# షాడో...

మనిషి, మనిషి జీవితంలోని వివిధ సన్నివేశాలు, పార్శ్వాలపైన ఇప్పటిదాకా చాలా పుస్తకాలు వచ్చాయి. కవిత్వరూపంలో, కథల రూపంలో, ఎక్కువగా నవలల రూపంలో మనిషి తనానికి సంబంధించి మనిషి మనస్తత్వానికి సంబంధించి చాలా సాహిత్యం వచ్చింది. నేను కూడా చాలా రోజుల నుండి మనిషి, మనస్తత్వం గురించిన కవిత్వం రాయాలనీ, ఈ కవితలన్నింటినీ ఒక పుస్తకరూపంలో తీసుకురావాలని అనుకుంటూ ఉండేవాణ్ణి. నా మొదటి పుస్తకం 'నెగడు' కంటే ముందే 'షాడో' రావలసి ఉండె. అయితే కొంత కాలంగా సామాజిక ఉద్యమాల్లో తీరిక లేకుండా ఉండడం వలన ఈ కవితలన్నింటినీ పుస్తకరూపంలో తీసుకురావడం కొంత ఆలస్యమైంది. ఇప్పటికీ నాకోరిక పుస్తక రూపం దాల్చినందుకు సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా 'షాడో' రావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియు జేసుకుంటూ... 'సాహిత్యం జీవితాన్ని వ్యాఖ్యానించాలి' అన్న ప్రేమ్‌చంద్ గారి మాటతో మమేకమౌతూ...

✵

ఉద్యమం, సాహిత్యం ఏవైనా మనిషిని మనిషిగా నిలబెట్టడం కోసం జరిగే సంఘర్షణ రూపాలే. మనిషిని మనిషిగా గుర్తించాలి అనే ఆలోచనే సాహిత్యానికైనా, ఉద్యమానికైనా పునాది అని నేను నమ్ముతాను. నిజానికి మనిషికి జీవించడం కన్నా పెద్ద పోరాటం లేదనేది నేను ఎప్పుడూ భావించే విషయం.

✵

'Man is a Social Animal' అనేది అక్షర సత్యం. మనిషి మొదట తనను తాను గెల్చుకుంటూ సమాజంలో నిలబడటం ఒక నిత్య పోరాటమే. మరీ ముఖ్యంగా ఎదుటివాళ్ళ బాధలను, సంతోషాలను, కష్టాలను, కన్నీళ్ళను అన్నింటినీ పంచుకోవడమనే బ్రతుకుంటేనే జీవితానికి సార్ధకత అనేది నేనెప్పుడూ నా అంతరంగంలో ప్రోది చేసుకున్న భావన.

✵

మనుష్యుల్లో అంతరించిపోతున్న సుహృద్భావ వాతావరణం ప్రస్తుతం నన్ను బాగా కలచివేస్తున్న విషయం. ఎదుటి వ్యక్తి గురించి క్షణకాలం పాటు కూడా ఆలోచించే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఎవరి బతుకు వాళ్ళది... అందరూ వాయిదాల చొప్పున మనిషి తనానికి దూరమౌతుండడం చూస్తూనే ఉన్నాం... అంతా కృత్రిమత్వం... ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని గందరగోళంలో చిక్కుకుపోయిన నాలాంటి సగటు వ్యక్తి అనుభవిస్తున్న బాధలు, గాధలే 'షాడో'. ఈ క్రమంలో నేను అనుభవించిన అనుభూతులు, పంచుకున్న బాధలు, పెంచుకున్న ప్రేమలు, అనురాగాలు, నమ్మకాలు... ఒక్కటేమిటి... నాలోని అంతరంగం... నాలాగే ఉన్న నా గుంపు అంతరంగాన్ని ప్రతిబింబించే విధంగా నా 'షాడో' రూపొందిందని భావిస్తున్నాను.

✵

నా సాహిత్యాన్ని చదువుతూ నన్ను అనుక్షణం ప్రోత్సహిస్తున్న యూనివర్సిటీ మిత్రులు మడత భాస్కర్, రేనా ఈశ్వర్, శ్యామలక్క, బంగారు రమ, సస్య, కృష్ణవేణి, కర్రె సదాశివ్, రమణ, సాంబన్న, నల్లా వేమన, వలిశెట్టి గాంధీలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే నా రోజువారీ జీవనంలో నాకు అండగా ఉంటున్న బిల్లా రవీందర్ రెడ్డి, లక్కర్సు అశోక్, భూక్య తిరుపతి నాయక్, కామిశెట్టి శ్రీధర్, మామిడాల ప్రవీణ్, మాలోతు మంగీలాల్, నా చిన్ననాటి మిత్రులు తెల్లం కృష్ణమోహన్, పుప్పాల మనోహర్, జంపుల బాబురావు, పెరుగు శ్రీధర్, సరోహ సంగీత్‌లకు, అదేవిధంగా

సామాజిక ఉద్యమాల్లో నాకు తోడుగా నిలుస్తున్న సోమ రామ్మూర్తి, పాలకుర్తి విజయ్, అరుణ, నలిగంటి చంద్రమౌళి, కోల జనార్ధన్, కూన మొగిళి, ఆస్నాల శ్రీనన్న, మెజీషియన్ నారాయణ, బైరి నరేష్, అగస్టీన్‌లకు, అలాగే పెద్దలు ఉగ్గె రమేష్, బుద్దె లక్ష్మీనారాయణ, చుంచు కట్టమల్లు, గట్ల రాంరెడ్డి, పోతురాజు రాజు, ఉప్పల రాంచందర్ వర్మ, చింతం ధనుంజయ, నాంద్రె అమర్‌నాథ్, కానిగంటి మధుకర్ వర్మ, ఇంకా ఆగపాటి అరుణ్, అల్లుడు బొట్టు శ్రవణ్, కెమెరామెన్ నయీం మామ, వలస వేణులకు పుస్తక సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. భవిష్యత్‌లో మీ అందరి ప్రోత్సాహంతో ఇంకా మంచి కవిత్వం వ్రాస్తానని మీకు వాగ్దానం చేస్తూ 'నెగడు' లాగే దీన్ని ఆదరిస్తారని కోరుకుంటూ...

మీ

**చింతం ప్రవీణ్**

## పరిచయం



పేరు : **చింతం ప్రవీణ్‌కుమార్**

అమ్మ : **చింతం యాదమ్మ**

నాన్న : **చింతం రాజేశ్వర్**

జననం : 10 నవంబర్, 1981

నివాసం : 16-10-236, శివనగర్, వరంగల్

చదువు : పిహెచ్.డి. (తెలుగు) ప్రస్తుతం
(పి. చంద్ యాదగిరి కథలు - పరిశీలన) అనే అంశంపై
ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు గారి పర్యవేక్షణలో

- యం.ఎ., (తెలుగు లిటరేచర్), కాకతీయ విశ్వవిద్యాలయం
- యం.సి.జే, కాకతీయ విశ్వవిద్యాలయం, హనుమకొండ
- బి.కాం., కాకతీయ డిగ్రీ కళాశాల (1999-2002), హన్మకొండ.
- ఇంటర్మీడియట్ (బై.పి.సి), గవర్నమెంటు జూనియర్ కళాశాల (1996-1998), హనుమకొండ
- పదవ తరగతి-ఆర్యవైశ్య హైస్కూల్, వరంగల్ (1996)
- ప్రాథమిక, మాధ్యమిక విద్య - వందన హైస్కూల్, శివనగర్, వరంగల్ (1986-1993)

రచనలు : 'నెగడు' - తెలంగాణా కవిత్వం (2012)

సామాజిక విషయాలు : నవసమాజ్ సేవా సమితి (NSSS) అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహణ
బి.సి. స్టడీ ఫోరం కన్వీనర్‌గా బాధ్యతలు
కవి సంగమం, గోదావరి సాహితీ మిత్రులతో- కవితా సృజన

భవిష్యత్ కార్యక్రమం : 'చింతం శాంతవ్వ' ఫౌండేషన్ స్థాపన
బి.సి. రాజకీయ కవిత్వం
(మిత్రుడు చిర్రా రాజేష్ ఖన్నాతో కలిసి)

అవార్డులు : బెస్ట్ యూత్ అవార్డు, 2012 అగష్టు 15, వరంగల్